అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people



## ఏసీబీ వలలో తహశీల్దార్

- చేర్యాల తహశీల్దార్ కార్యాలయంలో దాడులు
- రూ.70 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన తహశీల్దార్

02

## పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన 02



మంగళవారం 7, జూలై 2026 సంపుటి :03 సంచిక :141 పేజీలు :05 వెల ₹5

- ఓ ఉన్నతాధికారికి రూ.2 లక్షలు ఇస్తనని ఒప్పుకున్న
- ఫోన్ సంభాషణలో ఓ మాజీ ప్రజాప్రతినిధి.. ఆడియో లీక్.. వైరల్
- ఓ ఉన్నతాధికారిపైనా కామెంట్.. అధికారవర్గాల్లో చర్చ
- భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల్లో ప్రకంపనలు
- రెవెన్యూ శాఖలో కలకలం!
- పోలీసులకు ఫిర్యాదు చేసే ఆలోచనలో ఓ అధికారి?

# లంచాలు ఇస్తేనే పనులు

వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం ఓ రెవెన్యూ అధికారికి రూ.50 వేలు ఇచ్చిన
ఇంకోచోట భూవివాదం పరిష్కారానికి తహసీల్దార్ ఆఫీస్ లో రూ.2.50 లక్షలు ఇచ్చిన

రెవెన్యూ శాఖలో అవినీతి వేళ్లూనుకుందని, కొందరు అధికారులు లంచాలు ముట్టనిదే పనులు చేయడం లేదని ఇద్దరి మధ్య జరిగిన సంభాషణతో కూడిన ఒక ఆడియో భూపాలపల్లి, హనుమకొండ జిల్లాలో కలకలం రేపుతుంది. ప్రధానంగా ఈ సంభాషణలో ఒక మాజీ ప్రజా ప్రతినిధి తమ వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం ఓ మండలంలోని కీలకమైన రెవెన్యూ అధికారికి రూ.50 వేలు ఇచ్చినట్లు, మరో మండల తహశీల్దార్ కార్యాలయంలో తనకు చెందిన ఇంకో భూమికి సంబంధించిన వివాదం పరిష్కారం కోసం రూ.2.50 లక్షలు ఇచ్చానని, ఇదే విషయమై ఓ ఉన్నతాధికారికీ రూ.2 లక్షలు ఇస్తానని ఒప్పుకున్నానని పేర్కొనటం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. అంతేకాదు ఒక ఉన్నతాధికారిని సదరు మాజీ ప్రజాప్రతినిధి బ్రోకర్ అని సంబోధించడం కూడా తీవ్ర చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ ఆడియో అధికారవర్గాలతో పాటు రాజకీయ వర్గాల్లోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఆడియో తమ దృష్టికి రావడంతో ప్రభుత్వ నిఘా వర్గాల అధికారులు రంగంలోకి దిగారు. మాజీ ప్రజాప్రతినిధి ప్రస్తావించిన ఆడియోలోని అంశాలపై తమ నెట్వర్క్ ద్వారా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

– అక్షరదర్బార్, హనుమకొండ

02



## 'ఎల్ నినో' ప్రభావం

- తక్కువ నీటితో పండే పంటలపై దృష్టి పెట్టండి
- వరి, పత్తికి బదులు కందులు, ఆయిల్ పామ్.. ప్రత్యామ్నాయ సాగును ప్రోత్సహించాలి
- కలెక్టరేట్ సమావేశంలో చాహత్ బాజ్‌పాయ్

02





## పన్ను వసూళ్ల లక్ష్యాలను సాధించాలి

- బల్దియా కమిషనర్ టి. వెంకన్న
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరిక

02



# పీడీఎస్ రైస్ పట్టివేత

- 62 బస్తాల బియ్యం స్వాధీనం
- టాస్క్‌ఫోర్స్ దాడిలో అక్రమ నిల్వ బట్టబయలు

అక్షరదర్బార్, హనుమకొండ: ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 62 బస్తాల్లో నిల్వ ఉన్న 31 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.1.08 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్‌కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు హనుమకొండలోని గోపాలపూర్ గణేష్‌నగర్‌లో దాడి నిర్వహించారు. అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బండారి రాజ్‌కుమార్ (30) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడు పెద్దపల్లి జిల్లా కల్వశ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామానికి చెందినవాడని, ప్రస్తుతం గోపాలపూర్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. విచారణలో గోపాలపూర్ పరిసర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, అధిక ధరకు ఇతరులకు విక్రయిస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు అధికారులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం, నిందితుడిని తదుపరి చర్యల కోసం కేయూసీ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ మధుసూదన్ తెలిపారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బండారి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- బాధితులతో మర్యాదగా వ్యవహరించాలి
- రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి
- శాఖాపరమైన ఫిర్యాదులు ఇకపై ఆన్‌లైన్ విధానంలోనే
- వరంగల్ సీపీ ఎన్ శ్వేత
- హనుమకొండ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



అక్షరదర్బార్, హనుమకొండ: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి ప్రజలకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, సోమవారం ఆమె తొలిసారిగా హనుమకొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను తనిఖీ చేసి, వాటి స్వాధీనానికి గల కారణాలు, కేసుల పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసు నమోదులు, ఇతర పరిపాలనా అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను తెలుసుకుని, వారి విధి నిర్వహణపై ఆరా తీశారు.

**బాధితులకు నమ్మకం కలిగించాలి**

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీసులు ప్రజల సేవకులనే భావనతో విధులు నిర్వహించాల్సిన బాధ్యత ఉందన్నారు. "పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి. అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి రసీదు అందజేయాలి. ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించారనే నమ్మకం ప్రజల్లో కలిగేలా చర్యలు తీసుకోవాలి" అని ఆమె ఆదేశించారు.

**రాత్రి వేళల్లో అప్రమత్తత అవసరం**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను అనవసరంగా ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని సీపీ స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వచ్చే అత్యవసర ఫిర్యాదుల విషయంలో విధుల్లో ఉన్న సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, వెంటనే స్టేషన్ అధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

**ఇకపై ఆన్‌లైన్‌లోనే శాఖాపరమైన ఫిర్యాదులు**

అలాగే శాఖాపరమైన సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ఇకపై పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే సమర్పించాలని కమిషనర్ స్పష్టం చేశారు. వాటి పరిష్కార ప్రక్రియను స్టేషన్ అడ్మిన్ ఎస్‌ఐ పర్యవేక్షించి, బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ఏసీపీలు నర్సింహారావు, సత్యనారాయణలతో పాటు హనుమకొండ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భార్యకు వీడియో కాల్ చేస్తూ..

- రైలు కిందపడి దస్తావేజు లేఖరి ఆత్మహత్య
- కాజీపేటలో విషాదం

అక్షరదర్బార్, కాజీపేట: కుటుంబ కలహాలు ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఒక కుటుంబాన్ని తీవ్ర శోక సంద్రంలో నెట్టింది. హన్మకొండ జిల్లా కాజీపేట రైల్వే స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరి (డాక్యుమెంట్ రైటర్)గా పనిచేస్తున్న రాజేశ్ నాయక్ అనే వ్యక్తి గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన ఆయన కాజీపేట పరిధిలో రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నాడు. రైలు వస్తున్న సమయంలో తన భార్యకు వీడియో కాల్ చేసి, ఆమె చూస్తుండగానే రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. కళ్లెదుటే భర్త రైలు కిందపడిపోవడాన్ని చూసిన భార్య, కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

**కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు**

ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలే ఈ దారుణానికి ప్రధాన కారణమని భావిస్తున్నారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని, రాజేశ్ నాయక్ మొబైల్ ఫోన్ ఆధారంగా మరిన్ని వివరాలు సేకరిస్తూ దర్యాప్తు ముమ్మరం చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరిగా అందరితో కలుపుగోలుగా ఉండే రాజేశ్ నాయక్ హఠాన్మరణంతో ఆయన సహచర ఉద్యోగులు, మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# 'ఎల్ నినో' ప్రభావం

- తక్కువ నీటితో పండే పంటలపై దృష్టి పెట్టండి
- వరి, పత్తికి బదులు కందులు, ఆయిల్ పామ్..
- ప్రత్యామ్నాయ సాగును ప్రోత్సహించాలి
- కలెక్టరేట్ సమావేశంలో చాహత్ బాజ్‌పాయ్



అక్షరదర్బార్, హనుమకొండ: జిల్లాలో సాంప్రదాయకంగా వేసే వరి, పత్తి పంటలకు బదులుగా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపేలా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించే అంశంపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల్లో వర్షపాతం నమోదు, ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతుల నుంచి వస్తున్న స్పందనను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంతమంది రైతులు కందులు, పెసర, ఇతర పప్పు దినుసుల పంటలతో పాటు కూరగాయలు సాగు చేశారనే వివరాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

**అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదే..**

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, అందువల్ల రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి, పత్తి పంటలపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఇందుకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. మండలాల్లో కందులు, పప్పు దినుసు పంటలు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరిగేలా చూడాలన్నారు.

**ఆయిల్ పామ్ సాగుపై దృష్టి పెట్టాలి..**

నిరంతరం ఒకే రకమైన పంటలు వేయడం వల్ల నేల సారం తగ్గి ఎదురయ్యే నష్టాలను, ప్రత్యామ్నాయ పంటల ద్వారా లభించే లాభాలను రైతులకు వివరించాలని కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా దీర్ఘకాలిక లాభాలను ఇచ్చే ఆయిల్ పామ్ పంటను రైతులు సాగు చేసే విధంగా ప్రత్యేకంగా ప్రోత్సహించాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, ఏడీఏలు ఆదిరెడ్డి, అవినాష్ వర్మ, సాంకేతిక వ్యవసాయ అధికారులు కమలాకర్, శ్రీధర్ రెడ్డి, అఫ్జల్ పాషా మరియు అన్ని మండలాల వ్యవసాయ అధికారులు (ఏఓలు) పాల్గొన్నారు.



# లంచాలు ఇస్తేనే పనులు

- వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం ఓ రెవెన్యూ అధికారికి రూ.50 వేలు ఇచ్చిన
- ఇంకోచోట భూవివాదం పరిష్కారానికి తహసిల్దార్ ఆఫీస్ లో రూ.2.50 లక్షలు ఇచ్చిన
- ఓ ఉన్నతాధికారికి రూ.2 లక్షలు ఇస్తనని ఒప్పుకున్న
- ఫోన్ సంభాషణలో ఓ మాజీ ప్రజాప్రతినిధి.. ఆడియో లీక్.. వైరల్
- ఓ ఉన్నతాధికారిపైనా కామెంట్.. అధికారవర్గాల్లో చర్చ
- భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల్లో ప్రకంపనలు
- రెవెన్యూ శాఖలో కలకలం!
- పోలీసులకు ఫిర్యాదు చేసే ఆలోచనలో ఓ అధికారి?

అక్షరదర్బార్, హనుమకొండ : రెవెన్యూ శాఖలో అవినీతి వేళ్లూనుకుందని, కొందరు అధికారులు లంచాలు ముట్టనిదే పనులు చేయడం లేదని ఇద్దరి మధ్య జరిగిన సంభాషణతో కూడిన ఒక ఆడియో భూపాలపల్లి, హనుమకొండ జిల్లాలో కలకలం రేపుతుంది. ప్రధానంగా ఈ సంభాషణలో ఒక మాజీ ప్రజా ప్రతినిధి తమ వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం ఓ మండలంలోని కీలకమైన రెవెన్యూ అధికారికి రూ.50 వేలు ఇచ్చినట్లు, మరో మండల తహశీల్దార్ కార్యాలయంలో తనకు చెందిన ఇంకో భూమికి సంబంధించిన వివాదం పరిష్కారం కోసం రూ.2.50 లక్షలు ఇచ్చానని, ఇదే విషయమై ఓ ఉన్నతాధికారికీ రూ.2 లక్షలు ఇస్తానని ఒప్పుకున్నానని పేర్కొనటం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. అంతేకాదు ఒక

### ఇంకో తహసీల్దార్ ఆఫీస్ లో..

సదరు మాజీ ప్రజా ప్రతినిధి తన సంభాషణలో భాగంగా భూపాలపల్లి జిల్లాకు పొరుగున ఉన్న హనుమకొండ జిల్లాలోని ఇంకో మండలంలో ఓ గ్రామం వద్ద తనకు ఉన్న భూమిపై తలెత్తిన వివాదం పరిష్కారం కోసం పనిచేసి పెట్టాలని అక్కడి మండల తహసిల్దార్ కార్యాలయంలో కిందిస్థాయి ఉద్యోగి నుంచి అధికారి వరకు లబ్ధి పొందేలా రూ.2.50 లక్షలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇదే పనికి సంబంధించి హనుమకొండ జిల్లాలోని ఓ ఉన్నతాధికారికి రూ.2ర లక్షలు ఇస్తానని ఒప్పుకున్నట్లు కూడా ఆయన చెప్పటం సంభాషణలో ఎదుటి వ్యక్తితో చెప్పటం ఇపుడు హాట్ టాపిక్ గా మారింది. రెవెన్యూ శాఖలోని పలువురు అధికారులు, ఉద్యోగులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినవస్తున్న తరుణంలో ఓ మాజీ ప్రజా ప్రతినిధి భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల్లోని రెవెన్యూ అధికారుల వ్యవహారాన్ని ప్రస్తావించిన ఆడియో బయటకు రావడం సంచలనం కలిగిస్తుంది. ఆడియోలోని అంశాలపై ఆరా తీస్తున్న నిఘా వర్గాల అధికారులు నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిసింది.

ఉన్నతాధికారిని సదరు మాజీ ప్రజాప్రతినిధి బ్రోకర్ అని సంబోధించడం కూడా తీవ్ర చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ ఆడియో అధికారవర్గాలతో పాటు రాజకీయ వర్గాల్లోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఆడియో తమ దృష్టికి రావడంతో ప్రభుత్వ నిఘా వర్గాల అధికారులు రంగంలోకి దిగారు. మాజీ ప్రజాప్రతినిధి ప్రస్తావించిన ఆడియోలోని అంశాలపై తమ నెట్వర్క్ ద్వారా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

### డబ్బులు ముట్టాకే రిజిస్ట్రేషన్..

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, వివాదాల పరిష్కారానికి సంబంధించి తాజాగా భూపాలపల్లి జిల్లాలో హైవేపై ఉన్న ఓ మండలంలోని ఇద్దరు వ్యక్తుల మధ్య తాజాగా ఫోన్ లో సంభాషణ జరిగింది. వీరిలో ఒకరు ఇదే మండలంలోని మాజీ ప్రజా ప్రతినిధి. ఈ ఇద్దరి మధ్య జరిగిన సంభాషణతో కూడిన ఆడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఇందులో ఉన్న ఉన్న సారాంశం భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల్లో సర్వత్రా చర్చకు దారితీసింది. ముఖ్యంగా ఈ ఆడియోలో మాజీ ప్రజా ప్రతినిధి ప్రస్తావించిన అంశాలపై రెండు జిల్లాల్లో ఇంట్రెస్టింగ్ టాక్ నడుస్తోంది. భూపాలపల్లి జిల్లాలో హైవేపై ఉన్న మండలంలోని తమ గ్రామంలో తన తండ్రి పేర ఉన్న వ్యవసాయ భూమి తన పేర రిజిస్ట్రేషన్ చేయడానికి ఇక్కడ కీలకమైన ఓ రెవెన్యూ అధికారి కొర్రీలు పెట్టారని, ఆడబిడ్డలు వచ్చి సంతకం పెట్టాలన్నారని సదరు మాజీ ప్రజాప్రతినిధి పేర్కొన్నారు. డబ్బుల కోసమే సదరు రెవెన్యూ అధికారి వివిధ కారణాలు చెపుతుండటంతో పలుకుబడి ఉండి కూడా తాను చివరకు ఆ రెవెన్యూ అధికారికి రూ.50 వేలు ఇచ్చానని, తహసిల్దార్ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగికి ఈ డబ్బు ముట్ట చెప్పిన తర్వాతే సదరు రెవెన్యూ అధికారి తన తండ్రి పేర ఉన్న వ్యవసాయ భూమిని తన పేర రిజిస్ట్రేషన్ రిజిస్ట్రేషన్ చేశారని పేర్కొనటం కలకలం రేపింది. అంతేకాదు ఈ అవినీతి అధికారి ఇటీవల మరో మండలానికి బదిలీపై వెళ్లే ప్రతిపాదన తెరపైకి రాగా తానే ఆ బదిలీని ఆపినట్లు కూడా ఆయన పేర్కొనటం గమనార్హం. ఇదే క్రమంలో భూపాలపల్లి జిల్లాలోని ఓ ఉన్నతాధికారిని ఆ మాజీ ప్రజాప్రతినిధి బ్రోకర్ అని ప్రస్తావించటంపై అధికార వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే ఈ జిల్లాలో తనకు డబ్బు ఇచ్చినట్లు పేర్కొన్న మాజీ ప్రజాప్రతినిధిపై పోలీసులకు ఫిర్యాదు చేసే ఆలోచనలో సంబంధిత రెవెన్యూ అధికారి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# గుంతల రోడ్లతో నిత్యం ప్రమాదాలు



### పరకాల ప్రజల ఆవేదన

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారి వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. బస్టాండ్ కూడలి, కూరగాయల మార్కెట్, పోచమ్మగుడి ప్రాంతాలలో రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు వినతులు అందించినా స్పందన లేదని, వర్షాల వల్ల గుంతలు మరింత విస్తరించాయని తెలిపారు. దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేయడం కంటే, పాత రోడ్డును తొలగించి నూతన కాంక్రీట్ రోడ్డు నిర్మిస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అధికారులు వెంటనే స్పందించి పనులు ప్రారంభించాలని కోరారు.

# పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షరదర్బార్, భూపాలపల్లి: జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, వేగంగా కొనసాగుతోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం క్యాంపు కార్యాలయంలో బిఎల్ఓ సదయ్య, సూపర్ వైజర్ జితేందర్ లు కలెక్టర్‌ను కలిసి, క్షేత్రస్థాయిలో సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ పోలింగ్ కేంద్రం 79 లో తన ఓటు హక్కును నమోదు చేసుకున్నారు.

### ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించి ఓటర్ల నుండి సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల ఆన్లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందని ఆయన గుర్తు చేశారు. "బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) క్షేత్రస్థాయిలో పర్యటించి నూతన ఓటర్ల నమోదు, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి వివరాలను పకడ్బందీగా సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియకు ప్రజలందరూ పూర్తిగా సహకరించాలి." అని రాహుల్ శర్మ అన్నారు.


### వంద శాతం విజయవంతం చేయాలి

ఎలాంటి తప్పులు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లాలో జరుగుతున్న ఈ ఎన్యూమరేషన్ ప్రక్రియను అధికారులు బాధ్యతగా తీసుకుని వంద శాతం విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఏసీబీ వలలో తహశీల్దార్

- చేర్యాల తహశీల్దార్ కార్యాలయంలో దాడులు
- రూ.70 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన తహశీల్దార్



అక్షరదర్బార్, చేర్యాల: సిద్దిపేట జిల్లా చేర్యాల మండల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. భూమి సంబంధిత పని కోసం వచ్చిన వ్యక్తి నుంచి రూ.70 వేల లంచం తీసుకుంటుండగా తహశీల్దార్ దిలీప్ నాయక్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు ముందస్తు ప్రణాళికతో ట్రాప్ నిర్వహించిన ఏసీబీ అధికారులు, అనంతరం కార్యాలయంలో సోదాలు చేపట్టి పలు రికార్డులు, పత్రాలను పరిశీలించారు. లంచం వ్యవహారానికి సంబంధించిన మరిన్ని ఆధారాలు సేకరించినట్లు తెలిసింది. తహశీల్దార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనతో చేర్యాల మండలంలో కలకలం రేగింది.

# పన్ను వసూళ్ల లక్ష్యాలను సాధించాలి

- బల్దియా కమిషనర్ టి. వెంకన్న
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరిక



అక్షరదర్బార్, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్దేశిత పన్ను వసూళ్ల లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా తప్పనిసరిగా సాధించాలని బల్దియా కమిషనర్ టి వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో రెవెన్యూ అధికారుల పనితీరు, పన్ను వసూళ్ల పురోగతిపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. సర్కిళ్ల వారీగా వసూళ్ల స్థితిగతులు, ముందస్తు పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ పథకం అమలును పరిశీలించిన కమిషనర్.. కొన్నిచోట్ల ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వసూళ్లు మందగించడానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

### పన్ను పరిధి వెలుపల ఒక్క ఆస్తి కూడా ఉండొద్దు

నగరంలోని ప్రతి ఆస్తికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని, ఒక్క ఆస్తి కూడా పన్ను పరిధికి వెలుపల ఉండకూడదని కమిషనర్ స్పష్టం చేశారు. "పన్ను పరిధిలో లేని ప్రతి ఆస్తిని గుర్తించి వెంటనే నమోదు చేయాలి. అవసరమైన చోట పన్ను నిర్ధారణను సవరించాలి. త్వరలోనే నగరవ్యాప్తంగా భౌగోళిక సమాచార వ్యవస్థ ఆధారంగా త్రి డి సర్వే చేపట్టనున్నాం. ఆ సర్వేకు ముందే అన్ని ఆస్తుల వివరాలు, పన్ను నిర్ధారణలు ఎటువంటి లోపాలు లేకుండా సక్రమంగా పూర్తి కావాలి" అని ఆదేశించారు.

### ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు

ఆస్తి పన్నులకు సంబంధించిన అంశాల్లో ఉద్యోగులపై ఫిర్యాదులు వస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఆస్తుల యాజమాన్య మార్పిడికి సంబంధించిన దరఖాస్తులను పక్షం రోజులలోపు పరిష్కరించాలని గడువు విధించారు. "ప్రతి రెవెన్యూ అధికారి, బిల్లు వసూలుదారు తమ పరిధిలోని నివాస, వాణిజ్య భవనాలు, కొత్తగా నమోదు చేయాల్సిన ఆస్తులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. ఆస్తి పన్నుతో పాటు నీటి పన్ను వసూళ్లపైనా ప్రత్యేక దృష్టి సారించి, నగర ఆదాయం పెరిగేలా కార్యాచరణ చేపట్టాలి. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు." టి వెంకన్న అన్నారు.



## ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి

అక్షరదర్బార్, పరకాల : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను సోమవారం పరకాలలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణ శాఖ ఉపాధ్యక్షుడు మిడిదొడ్డి నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.పి. జయంతిలాల్, దేవునూరి మేఘనాథ్ పాల్గొని ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగాలను కొనియాడుతూ, ముఖర్జీ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణ చారి, కుక్కల విజయ్ కుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, సంగా పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి పాల్గొన్నారు.

## ఉచిత పుస్తకాలు, దుస్తులు అందించాలి

- కలెక్టర్‌కు ఏబీఎస్ఎఫ్, స్వేరోస్ వినతి

అక్షరదర్బార్, నర్సంపేట : బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ద్వారా చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు వెంటనే అందజేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, స్వేరోస్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు బోట్ల నరేష్, శనిగరపు రాజేందర్ ప్రసాద్ మాట్లాడుతూ కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వం అందించాల్సిన ఉచిత పుస్తకాలు, దుస్తులు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. అలాగే జిల్లాలోని అనేక ప్రైవేట్ స్కూల్ బస్సులు ఫిట్నెస్ నిబంధనలు పాటించకుండా, పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తూ వారి ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నాయని, తక్షణమే తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## సైనికుల త్యాగాలను దేశం ఎన్నటికీ మరువదు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

అక్షర దర్బార్, శాయంపేట : దేశ సరిహద్దుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ అరికిళ్ల ప్రవీణ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. జవాన్ ప్రవీణ్ యువతకు ఆదర్శమని కొనియాడుతూ, వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జవాన్ తల్లిదండ్రులు అరికిళ్ల చేరాలు, భద్రమ్మ, సోదరుడు ప్రసాద్, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## మర్రిపల్లి గ్రామానికి కొత్త రేషన్ షాప్ మంజూరు చేయాలి

### సర్పంచ్ సుజాత

అక్షరదర్బార్, దుగ్గొండి : తమ గ్రామానికి కొత్త రేషన్ షాప్ మంజూరు చేయాలని కోరుతూ దుగ్గొండి మండలం మర్రిపల్లి గ్రామస్తులు, వార్డు సభ్యులతో కలిసి సర్పంచ్ డ్యాగం సుజాత నర్సంపేట ఆర్డీఓ ఉమారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో దాదాపుగా 450 రేషన్ కార్డులు ఉన్నాయని, ప్రస్తుతం రేషన్ తెచ్చుకోవడానికి ఇతర గ్రామాలకు వెళ్లడం ఇబ్బందిగా మారిందన్నారు. గ్రామంలోనే రేషన్ షాప్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు డ్యాగం రాణి, ఎరుకల పద్మ, గ్రామస్తులు డ్యాగం శివాజీ, అల్లాపురం ప్రదీప్ పాల్గొన్నారు.

## శాయంపేట నవారు, షతరంజి చేనేత సంఘం పాలకవర్గం ఏకగ్రీవం

అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట నవారు, షతరంజి చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం పాలక వర్గ ఎన్నికల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. పాలక వర్గంలోని ఇద్దరు మహిళలు, 7 పురుషుల స్థానాలకు గాను మొత్తం 10 నామినేషన్లు రాగా, ఒకరు ఉపసంహరించుకోవడంతో మొత్తం 9 స్థానాలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి రవీంద్ర తెలిపారు.



## చేనేత సంఘం అభ్యర్థులకు ఎన్నికల గుర్తుల కేటాయింపు

- బరిలో 18 మంది అభ్యర్థులు
- ఎన్నికల అధికారి ఎం. సునీల్ కుమార్

అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం ఎన్నికల ప్రక్రియలో భాగంగా బరిలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించినట్లు ఎన్నికల అధికారి ఎం. సునీల్ కుమార్ తెలిపారు. ఈ ఎన్నికల్లో మొత్తం 21 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, వారిలో ముగ్గురు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని వివరించారు. దీంతో ప్రస్తుతం బరిలో మిగిలిన 18 మంది అభ్యర్థులకు సోమవారం గుర్తులను కేటాయించామన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం తదుపరి ప్రక్రియ కొనసాగుతుందని, ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.



# సమస్యల నిలయంగా నర్సంపేట పెద్దాసుపత్రి

- ఏఐటీయూసీ ఆగ్రహం
- కనీస వైద్యానికి మందుల్లేక రోగుల అవస్థలు
- ప్రైవేట్ మెడికల్ షాపులకు రెఫర్
- స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని గుంపెల్లి మునీశ్వర్ హెచ్చరిక

అక్షరదర్బార్, నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సమస్యల నిలయంగా మారిందని, కనీస వైద్యానికి అవసరమైన మందులు కూడా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర సభ్యుడు గుంపెల్లి మునీశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా అనేక గ్రామాల నుండి ఎన్నో ఆశలతో వచ్చే పేద రోగులకు సరైన వైద్యం, మందుల పంపిణీ కరువైందని మండిపడ్డారు. మందుల కోసం బయట ప్రైవేటు మెడికల్ షాపులకు వెళ్లమనడం వల్ల పేదలు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం తక్షణమే స్పందించి అన్ని రకాల మందులను ఆసుపత్రిలోనే అందుబాటులో ఉంచాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని డిమాండ్ చేశారు.



# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా ప్రగతికి కార్యాచరణ వేగవంతం
- యూరియా సరఫరా పై అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి
- అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి
- మేడారం మాస్టర్ ప్లాన్ పై ప్రత్యేక దృష్టి సారించాలి
- మంత్రి సీతక్క




అక్షర దర్బార్ /ములుగు: మేడారం ఆలయ అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో కొనసాగుతున్న పెండింగ్ అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మేడారం ఆలయ అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, ఐడీఓసీ పనుల పురోగతి, రామచంద్రపురం భూసర్వే, పైలాన్ నిర్మాణం, వర్షాల పరిస్థితి, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన సన్నాహక చర్యలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం పంచాయతీ రాజ్ శాఖ ద్వారా సుమారు రూ.6,000 కోట్ల విలువైన పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ములుగు జిల్లాలో పర్యటించే సందర్భంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ రహదారి పక్కన గట్టమ్మ దేవాలయం సమీపంలో పంచాయతీరాజ్ రోడ్డు పనులకు భూమిపూజ, నూతన కలెక్టరేట్, మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, కేంద్రీయ విద్యాలయం, పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్, కరకట్టల నిర్మాణం తదితర కీలక అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలను ఒకే శిలాఫలకంపై పొందుపరిచి, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో భూసేకరణ, రహదారుల విస్తరణ, క్యూ లైన్ల పునర్వ్యవస్థీకరణ, అతిథి గృహం, ఆసుపత్రి, కాటేజీలు, పార్కింగ్, పారిశుధ్య సదుపాయాలు, జంపన్న వాగు పరిసరాల అభివృద్ధి తదితర అంశాలతో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. ప్రకృతి అందాలను పరిరక్షిస్తూ పర్యాటక అభివృద్ధికి అనుగుణంగా పనులు చేపట్టాలని, గట్టమ్మ దేవాలయం, పంచాయతీరాజ్ పైలాన్, ట్రైబల్ యూనివర్సిటీ, కలెక్టరేట్ తదితర ప్రాంతాలను అనుసంధానిస్తూ ములుగు జిల్లాను ఆకర్షణీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనుల్లో పూజారులు, స్థానిక ప్రజలు, అధికారులు పరస్పర సహకారంతో ముందుకు రావాలని కోరారు.

యుద్ధ ప్రాతిపదికన జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రామచంద్రపురం పరిధిలోని 10,600 ఎకరాల భూముల రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని, పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్, రామప్ప–లక్నవరం పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు చేపట్టాలని, రైతులకు యూరియా కొరత లేకుండా తగిన నిల్వలు, సరఫరా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, పట్వారిపల్లె, సర్వాపురం గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు సర్వేయర్ల ప్రత్యేక బృందాలను సిద్ధం చేయాలని సూచించారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టి ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అటవీశాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉంచి విస్తృతంగా మొక్కల నాటకం చేపట్టాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్వో రవికుమార్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు నడికూడలో విద్యుత్ వినియోగదారుల ప్రజావేదిక

అక్షరదర్బార్, నడికూడ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి టీజీఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో నడికూడ మండల సబ్‌స్టేషన్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల ప్రజావేదిక నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్–1 చైర్‌పర్సన్ (ఎఫ్ఏసీ) జి. నాగప్రసాద్ తెలిపారు. పరకాల టౌన్, రూరల్, శాయంపేట, ఆత్మకూర్, దామెర తదితర ప్రాంతాలకు చెందిన వినియోగదారులు ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, వోల్టేజ్ సమస్యలు, లోపభూయిష్ట మీటర్ల మార్పిడి, అధిక బిల్లులు, సర్వీస్ పేరు మార్పు తదితర అంశాలపై ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు సమర్పించవచ్చని పేర్కొన్నారు.



# నిబంధనలు ఉల్లంఘిస్తే అంతే

- ప్రైవేట్ స్కూల్ బస్సులపై ఆర్టీఏ ఉక్కుపాదం
- నర్సంపేటలో ముమ్మర తనిఖీలు.. తొమ్మిది వాహనాలపై చర్యలు
- పరిమితికి మించి విద్యార్థుల తరలింపు.. ఫిట్‌నెస్ లేని రెండు బస్సులు జప్తు




అక్షరదర్బార్, నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సులపై ఆర్టీఏ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వరంగల్ రోడ్డులోని అక్షర, బిట్స్ పాఠశాల బస్సులు పరిమితికి మించి (40 మందికి గాను 52 మందిని) విద్యార్థులను తరలిస్తున్నట్లు గుర్తించి మూడు బస్సులకు జరిమానా విధించారు. అనంతరం గీతాంజలి, డీజీ, డఫోడిల్స్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించగా.. బస్సుల్లో గడువు ముగిసిన అగ్నిమాపక యంత్రాలు, నాణ్యత లేని ప్రథమ చికిత్స కిట్లు, అత్యవసర ద్వారాల లోపాలు ఉన్నట్లు తేలింది. ఈ క్రమంలో ఫిట్‌నెస్ లేని రెండు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో పాటు మొత్తం తొమ్మిది వాహనాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. స్కూల్ బస్సులకు 15 ఏళ్ల వయోపరిమితి దాటకూడదని, ఆర్టీవో ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎల్లో రంగు, స్కూల్ పేరు, ఫోన్ నెంబర్, విండో గ్రిల్స్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఇద్దరు అటెండర్లు మరియు 5 ఏళ్ల అనుభవం ఉన్న క్లీన్ రికార్డ్ డ్రైవర్లు తప్పనిసరిగా ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు నరేందర్, ఉదయ్ కుమార్, నర్సంపేట సీఐ శ్రీనివాస్, ఎస్సై అరుణ్ పాల్గొన్నారు.

# వరి విత్తనాల ఆన్‌లైన్ నమోదుపై విత్తన డీలర్ల తీవ్ర అభ్యంతరాలు

**కమిషనర్ గోపి, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి వినతిపత్రం**

**సమస్యల నివృత్తికి వారం రోజుల్లో మార్గదర్శకాలు ఇస్తామని కమిషనర్ హామీ**

అక్షరదర్బార్, హైదరాబాద్ : వరి విత్తనాల విక్రయాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రతిపాదనపై తెలంగాణ రాష్ట్ర విత్తన, ఎరువుల డీలర్లు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రామడుగు మనోహర్‌రావులతో కూడిన ప్రతినిధి బృందం వ్యవసాయ శాఖ కమిషనర్ గోపిని కలిసి ఎక్స్‌పైరీ స్టాక్‌ల నిర్వహణ, లింక్ ప్రొడక్ట్స్‌ల విక్రయాలు, కలుపు మందుల అమ్మకాలపై ఉన్న ఇబ్బందులను వివరించింది. దీనిపై కమిషనర్ స్పందిస్తూ, ఏడు వరి రకాల వివరాల నమోదుపై ఉన్న సందిగ్ధతలను నివృత్తి చేసేందుకు వారం రోజుల్లో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డీలర్లు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వగా, ఈ బాధ్యతను డీలర్లపై వేయకుండా ప్రభుత్వ యంత్రాంగం ద్వారా నిర్వహించేలా సంబంధిత శాఖలతో చర్చిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

